

వామ్మో.. వానరాలు
రామకృష్ణాపూర్ పట్టణంలో కోతులు ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. ఇళ్లలోకి వస్తుండడంతో భయాందోళనకు గురవుతున్నారు. కోతులను పట్టి తరలించాలని కోరుతున్నారు. 8లో▸



సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం
అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే దివాకర్‌రావు అన్నారు. పలు మండలాల్లో శనివారం ఆయన ముస్లింలకు రంజాన్ కానుకలు పంపిణీ చేశారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
40.0 /27.0

వాతావరణం
ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. ఎండల తీవ్రత పెరిగే అవకాశం ఉంది. వాయువ్యం దిశగా వడగాలులు వీస్తాయి.



ధాన్యం కొనేదెప్పుడో..!

- రైతుల ఎదురుచూపులు
- గోదాముల్లో నిండుగా.. కల్లాల్లో మెండుగా..
- గత మూడు సీజన్ల ధాన్యం మగ్గుతున్న వైనం
- గోదాముల్లో ధాన్యం తీసుకునేందుకు మిల్లర్ల నిరాకరణ
- జిల్లాలో సీఎంఆర్ లక్ష్యం చేరని మిల్లులు


హాజీపూర్ మండలంలో రైతులు ఆరబోసుకున్న ధాన్యం, కుప్పలు

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో యాసంగి పంట పదిహేను రోజులుగా చేతికొస్తోంది. అధికారులు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఎప్పుడు ఏర్పాటు చేస్తారోనని రైతాంగం ఎదురుచూస్తోంది. ప్రస్తుతం ఉదయం ఎండలు మండుతుండగా సాయంత్రం సమయంలో మబ్బులు పడుతుండడం, వాతావరణ మార్పుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ యాసంగి సాగు, దిగుబడికి అనుగుణంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి 2.28లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా అధికారులు నిర్ణయించారు. కానీ ఇంతవరకు ఏజెన్సీల వారీగా కొనుగోలు కేంద్రాల కేటాయింపు, గన్నీ సంచులు, తదితర ఏర్పాట్లు చేపట్టలేదు. గత సీజన్ల ధాన్యం సీఎంఆర్ పూర్తి చేసేందుకు మిల్లర్లతో తర్జనభర్జన పడుతున్నారు.

సీఎంఆర్ లక్ష్యం గగనమే..
జిల్లాలో కస్టం మిల్లింగ్ రైస్(సీఎంఆర్) లక్ష్యం చేరడం గగనంగా మారింది. రైతుల నుంచి సేకరించి రైస్‌మిల్లర్లకు కేటాయించిన ధాన్యాన్ని మర ఆడించి బియ్యంగా మార్చి ప్రభుత్వాన్ని ఇవ్వాల్సి ఉంది. కానీ మిల్లర్లు తీవ్ర జాప్యం చేస్తుండడం, అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తుండడం వల్ల గడువుగా సీఎంఆర్ ఇవ్వడం కష్టంగా మారినట్లు తెలుస్తోంది. 2021–22 సీజన్ వానాకాలానికి సంబంధించి సీఎంఆర్ ఇంకా 10,757 మెట్రిక్ టన్నుల బియ్యం, గత యాసంగి సీజన్‌కు సంబంధించి 34,732 మెట్రిక్ టన్నులు, గత వానాకాలానికి సంబంధించి 75,005 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ రావాల్సి ఉంది. మూడు సీజన్ల ధాన్యం సీఎంఆర్ పూర్తి కాకపోవడంతో జిల్లాలోని మిల్లులు, గోదాముల్లో వేల క్వింటాళ్ల ధాన్యం మగ్గుతోంది. మరోవైపు ప్రస్తుత యాసంగి సీజన్ ధాన్యం కొనుగోలు కేంద్రాలకు కుప్పలు తెప్పలుగా వస్తోంది.

గత మూడు సీజన్లు, జిల్లాలోని మిల్లులకు తరలించిన ధాన్యం వివరాలు(మెట్రిక్ టన్నుల్లో)

సీజన్	మిల్లులకు ధాన్యం	సీఎంఆర్ ధాన్యం	అప్పగింత	పెండింగ్
వానాకాలం(2021-22)	1,37,180	91,910	81,152	10,757
యాసంగి(2021-22)	77,764.32	52,649	27,859	24,732
వానాకాలం(2022-23)	1,58,337	79,848	4,727	75,005

గత యాసంగి వివరాలు(మెట్రిక్ టన్నుల్లో)

రైస్‌మిల్లులకు తరలించిన ధాన్యం	53,808.400
గోదాములకు తరలించింది..	23,955.920
ఇంకా గోదాముల్లో ధాన్యం	19,570


దండేపల్లి: లింగపూర్ గోదాం నుంచి ధాన్యం తరలింపు

1.10 లక్షల మెట్రిక్ టన్నులు
మూడు సీజన్లకు సంబంధించి 1.10లక్షల మెట్రిక్ టన్నుల వరకు బియ్యం ఇవ్వాల్సి ఉంది. మిల్లుకు కేటాయించిన ధాన్యం కస్టం మిల్లింగ్ రైస్ ఇవ్వడంలో తాత్సారం చేస్తున్నా అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. రైస్‌మిల్లులు, గోదాముల్లోని ధాన్యాన్ని సీఎంఆర్ పూర్తి చేసి అందించాలని, గత వానాకాలం కేటాయించిన ధాన్యం సీఎంఆర్ ప్రారంభించాలని ఆదేశించింది. కానీ గడువులోగా సీఎంఆర్ ఇవ్వడం కష్టమేనని తెలుస్తోంది.

గడువు పెంచుతున్నా..
ప్రభుత్వ రంగ కొనుగోలు సంస్థలు పీఏసీఎస్, డీఆర్‌డీఏ, డీసీఎమ్మెస్ కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం సేకరించి జిల్లాలోని రైస్‌మిల్లులకు కేటాయిస్తున్నారు. క్వింటాల్ ధాన్యానికి రైస్‌మిల్లర్లు 68కిలోల బియ్యం ప్రభుత్వానికి ఇవ్వాల్సి ఉంటుంది. ఇలా వచ్చిన బియ్యాన్ని ఎఫ్‌సీఐకి అగ్రిమెంటు చేసుకుని తరలించాల్సి ఉంటుంది. బియ్యం అప్పగించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నా అధికారులు చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. ఏటా మిల్లులకు లక్ష్యం మేరకు ధాన్యం కేటాయించడం, బియ్యం ఇవ్వడంలో నిర్లక్ష్యం వహించడం, గడువు పెంచుతూ పోవడం.. ఇదే తంతు కొనసాగుతోంది.

గోదాముల్లో వేల క్వింటాళ్ల ధాన్యం
గత యాసంగి సీజన్‌లో 1,13,080 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రాగా 53,808.400 మెట్రిక్ టన్నులు మిల్లులకు తరలించారు. ఈ సీజన్‌లో ధాన్యం ఎక్కువగా రావడం, మిల్లుల్లో నిల్వలు పేరుకపోవడంతో 23,955.920 మెట్రిక్ టన్నుల ధాన్యం గోదాముల్లో నిల్వ చేశారు. మరో 27,915.04మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ఆదిలాబాద్, కుమురంభీం, పెద్దపల్లి జిల్లాల్లోని రైస్‌మిల్లులకు తరలించారు. ఇప్పటికే జిల్లాలోని మిల్లులకు తరలించిన ధాన్యంతోపాటు ప్రభుత్వ గోదాముల్లో నిల్వ చేసిన ధాన్యాన్ని కేటాయించిన రైస్‌మిల్లులకు తరలించాల్సి ఉంది. మిల్లుల్లో నిల్వలు పేరుకుపోవడంతో 12ఇంటర్మీడియెట్ గోదాముల్లో వివిధ ఏజెన్సీల ద్వారా సేకరించిన ధాన్యం ప్రభుత్వ గోదాముల్లో వేల క్వింటాళ్లు ఏడాది కాలంగా మగ్గిపోతోంది. నిల్వ చేసిన ధాన్యం కేటాయించిన మిల్లులకు తరలించడం ముందుకు సాగడం లేదు. ధాన్యం నాణ్యత లేక నష్టపోవాల్సి వస్తుందని మిల్లర్లు తీసుకునేందుకు ససేమిరా అంటున్నారు. లారీలను గోదాముకు పంపిస్తున్నా దించుకోబోమని మిల్ల ర్లు చెబుతుండడంతో లోడింగ్ కావడం లేదు. ఇప్పటివరకు కేవలం 4,385 మెట్రిక్ టన్నులు మాత్రమే మిల్ల లకు తరలించారు. ఇంకా 19,570 మెట్రిక్ టన్నుల్లో గోదాముల్లో నిల్వ ఉంది. ఈ నెలాఖరులోగా సీఎంఆర్ పూర్తి చేసి బియ్యం అందించాలని ప్రభుత్వం ఆదేశించింది. కానీ గడువులోగా పూర్తి కావడం కష్టంగానే మారింది. రైస్‌మిల్లర్లు, ఏజెన్సీల అధికారులతో ఈ నెల 12న కలెక్టరేట్‌లో ఉన్నతాధికారుల సమావేశం నిర్వహించి సీఎంఆర్ పూర్తి చేయాలని, కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ధాన్యం సేకరణలో ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. గత వానాకాలం, యాసంగి సీజన్ ధాన్యం ఎండకు ఎండి వానకు తడిసి మొలకెత్తిందని, నాణ్యత లేక నష్టపోవాల్సి వస్తుందని, ధాన్యం సేకరణ లక్ష్యాలతో తాము నష్టపోయేలా చేస్తున్నారని రైస్‌మిల్లర్లు ఆరోపిస్తున్నారు.

వరి కోసి వారమైంది..

వరి కోసి వారం రోజులైతంది. కల్లంలో ఆరబోసినం. రోజూ పొద్దుగాల ఆరబెట్టుడు మాపాటిలి కుప్పజేసుడు అవుతుంది. ఎండలు దంచికొడుతున్నాయి. తేమ, చెత్త లేకుండా మిషన్‌తోని తూర్పాల పట్టిన సెంటర్ ప్రారంభిస్తే అమ్ముకుందామని చూస్తున్నా. ఎప్పుడు ప్రారంభిస్తరో ఏమో తెలుస్తలేదు.
– కంద్రపు ఎల్లయ్య, గ్రామం: పెద్దంపేట్, మం: హాజీపూర్

తడవక ముందే కొనాలే..

పంట చేతికొచ్చి నాలుగు రోజులు అవుతుంది. ఎండలకు వడ్లు మంచిగా ఎండినయి. పొద్దుగాల ఎండలు మాపాటిలి మబ్బులు పడుతున్నాయి. ఎప్పుడు చెడగొట్టు వానలు పడుతాయోనని భయమైతంది. పోయినేడు కల్లంలో పోసినంక వర్షంతో తడిసినయి. ఈ ఏడాది కూడా వానలకు తడవకముందే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి కాంటా పెట్టాలి.
– పిడుగు మల్లేష్, హాజీపూర్

నాలుగు రోజుల్లో ప్రారంభిస్తాం..
ఈ నెలాఖరులో సీఎంఆర్ పూర్తి చేయాలని మిల్లర్లను ఆదేశించాం. గత ఏడాది యాసంగి గోదాముల్లో ఉన్న నిల్వ ఉన్న ధాన్యం మిల్లులకు తరలిస్తున్నాం. ఇప్పటికే మిల్లర్ల సమావేశం నిర్వహించాం. మిల్లర్లు ధాన్యం దించుకుంటున్నారు ఎలాంటి ఇబ్బంది లేదు. ప్రస్తుతం యాసంగి కొన్ని ప్రాంతాల్లో మాత్రమే ధాన్యం దిగుబడి వస్తుంది. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నాం. మరో మూడు నాలుగు రోజుల్లో కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తాం.
– ప్రేమ్‌కుమార్, జిల్లా పౌరసరఫరాల శాఖఅధికారి

న్యూస్‌రీల్

సీఎంఆర్ లక్ష్యం గడువులోగా పూర్తి చేయాలి

రైస్‌మిల్లులో అదనపు కలెక్టర్ తనిఖీ

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలోని రైస్‌మిల్లర్లకు కేటాయించిన సీఎంఆర్ లక్ష్యాలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని రైస్‌మిల్లును ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ సీఎంఆర్ లక్ష్యాలను ఈ నెల 30లోగా పూర్తి చేసి సంబంధిత నివేదికను అందించాలని తెలిపారు. నిర్దేశిత లక్ష్యాన్ని పూర్తి చేయడంలో అలసత్వం, నిర్లక్ష్యం వహించవద్దని, సంబంధిత శాఖల అధికారులు, రైస్‌మిల్లర్లు సమన్వయంతో పని చేసి లక్ష్యాన్ని పూర్తి చేయాలని తెలిపారు.

రోగులకు వీల్‌చైర్లే స్ట్రెచర్లు !
- ప్రభుత్వ ఆస్పత్రిలో కొరత
- ఇబ్బందులు పడుతున్న రోగులు


వీల్‌చైర్‌పై రోగిని తీసుకెళ్తున్న ఆసుపత్రి సిబ్బంది

మంచిర్యాలటౌన్: మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో సౌకర్యాలు, వసతులు కరువయ్యాయి. ప్రతీరోజు 300 నుంచి 400 వరకు ఓపీకి రోగులు వస్తుండగా, 250 మందికి పైగా వార్డుల్లో చికిత్స పొందుతున్నారు. రోజుకు 20 మందికి పైగా వివిధ రకాల శస్త్రచికిత్సలు నిర్వహిస్తున్నారు. శస్త్రచికిత్సల కోసం వెళ్లే రోగులకు రెండు స్ట్రెచర్లు అందుబాటులో ఉన్నాయి. ఇతర రోగులను వార్డుల నుంచి స్కానింగ్, ఇతరత్రా వాటికి తీసుకెళ్లేందుకు స్ట్రెచర్లు లేకపోవడంతో వీల్‌చైర్లనే వినియోగిస్తున్నారు. గత కోవిడ్ టీకా సమయంలో పలువురు దాతలు వృద్ధులు, దివ్యాంగులను టీకా కేంద్రాలకు తీసుకెళ్లేందుకు వీల్‌చైర్లు అందించారు. దీంతో ప్రతీ వార్డుకు రెండు నుంచి మూడు వీల్‌చైర్లు అందుబాటులో ఉన్నాయి. స్ట్రెచర్లు సైతం మాతాశిశు ఆరోగ్య కేంద్రం(ఎంసీహెచ్)ను ఇదే ఆసుపత్రిలో కొనసాగించినప్పుడు అందుబాటులో ఉన్నాయి. ఇటీవల ఎంసీహెచ్‌ను స్వంత భవనంలోకి మార్చడంతో వాటినీ తరలించారు. దీంతో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో రెండు స్ట్రెచర్లు అందుబాటులో ఉండగా, మిగతావి రిపేర్లు ఉన్నాయి. ఆసుపత్రిని అప్‌గ్రేడ్ చేస్తున్నా సరిపడా బెడ్‌లు, స్ట్రెచర్లు సమకూర్చక రోగులు ఇబ్బందులు పడుతున్నారు. మంచిర్యాల, కుమురంభీం జిల్లాలతోపాటు మహారాష్ట్ర నుంచి ప్రతీరోజు యాక్సిడెంట్లకు గురైన వారు, ఆత్మహత్య ప్రయత్నం చేసిన వారు వస్తుంటారు. వారిని అత్యవసర విభాగానికి వీల్‌చైర్ల ద్వారా తరలిస్తున్నారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హరిశ్చందర్‌రెడ్డిని సంప్రదించగా.. సరిపడా స్ట్రెచర్లు లేవని, కొత్త వాటి కొనుగోలుకు నిర్ణయించినట్లు తెలిపారు. కొన్ని మరమ్మతులు చేస్తే వినియోగంలోకి వస్తాయని, వీల్‌చైర్లు సరిపడా ఉన్నాయని తెలిపారు.

రిసార్ట్ భూముల తనిఖీ
భీమారం: మండల కేంద్రం సమీపంలోని గొల్లవాగుప్రాజెక్ట్ వద్ద సర్వేనెంబర్ 15లో నిర్మిస్తున్న రిసార్ట్ భూములను జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రాజెక్టును ఆనుకొని నిర్మిస్తున్న ఈ రిసార్ట్ వల్ల భూములు ఏమైనా ఆక్రమణకు గురవుతున్నాయా అనేది నివేదిక ఇవ్వాలని ఆర్డీవో వేణును ఆదేశించారు. ఆర్ఐ అరుణ, సీనియర్ అసిస్టెంట్ ఏసయ్య పాల్గొన్నారు.

రేషన్ డీలర్‌పై అసహనం
జైపూర్: మండలంలోని ముదిగుంట గ్రామంలో రేషన్‌దుకాణం నిర్వహణపై జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ అసహనం వ్యక్తం చేశారు. శనివారం ఆయన దుకాణాన్ని తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. డీలర్‌కు నోటీసులు ఇవ్వాలని తహసీల్దార్‌కు సూచించారు.

‘ఖర్గే’కు నాయకుల వీడ్కోలు


డిగ్రీ కాలేజీ హెలీప్యాడ్ వద్ద ఖర్గేకు వీడ్కోలు పలుకుతున్న కాంగ్రెస్ నాయకులు


ఖర్గేకు వినతిపత్రం అందిస్తున్న జనక్‌ప్రసాద్

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గే శనివారం ఉదయం హైదరాబాద్ బయలుదేరి వెళ్లారు. ఈ నెల 14న నస్పూర్‌లో జరిగిన జై భారత్ సత్యాగ్రహ బహిరంగ సభకు ఆయన హాజరైన విషయం తెలిసిందే. అదే రోజు తిరుగు ప్రయాణం వీలు కాలేదు. దీంతో సీసీసీ గెస్టు హౌజ్‌లో రాత్రి బస చేశారు. తెల్లవారు ఉదయం ఆరుగంటలకు హెలికాప్టర్‌లో హైదరాబాద్‌కు బయల్దేరి వెళ్లారు. అక్కడి నుంచి బెంగళూరులో ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారని పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ సందర్భంగా టీపీసీసీ తెలంగాణ ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రే, ఏఐసీసీ కార్యదర్శులు రోహిత్ చౌదరి, సంపత్, మంథని ఎమ్మెల్యే, ఏఐసీసీ కార్యదర్శి శ్రీధర్‌బాబు, పీసీసీ మాజీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ కొక్కిరాల ప్రేమ్‌సాగర్ రావు, డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ, జనక్‌ప్రసాద్, గణేష్ రాథోడ్, పలువురు కాంగ్రెస్ నాయకులు డిగ్రీ కాలేజీ హెలీప్యాడ్ వరకు వెళ్లి ఆయనకు వీడ్కోలు పలికారు.

కార్మికులకు ఆదాయ పన్ను మాఫీ చేయించాలి
శ్రీరాంపూర్: పార్లమెంట్‌లో ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి బొగ్గు గని కార్మికులకు ఆదాయ పన్ను మాఫీ చేయించాలని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గేను ఐఎన్టీయూసీ నేతలు కోరారు. మంచిర్యాలలోని మాజీ ఎమ్మెల్సీ ప్రేంసాగర్‌రావు ఇంట్లో బస చేసిన ఖర్గేను శనివారం ఐఎన్టీయూసీ సెక్రెటరీ జనరల్ బీ.జనక్‌ప్రసాద్, ప్రధాన కార్యదర్శి కాంపెల్లి సమ్మయ్య బొగ్గుగని కార్మికుల సమస్యలపై వినతిపత్రం అందజేశారు. బొగ్గు గని కార్మికుల 11వ వేతన ఒప్పందంలో తీవ్ర జాప్యం జరుగుతోందని, త్వరగా అమలు చేయించాలని పేర్కొన్నారు. రిటైర్డ్ కార్మికులకు పింఛన్ పెంచాలని, మెడికల్ ట్రీట్‌మెంట్ ఖర్చు రూ.25 లక్షలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ కేంద్ర ఉపాధ్యక్షులు జే.శంకర్‌రావు, కలవేని శ్యాం, నాయకులు దేవి పోశయ్య, రాంశెట్టి నరేందర్, భీం రవి పాల్గొన్నారు.

‘టోల్’ వసూళ్లపై విచారణ

- కౌంటర్ దాఖలు చేసిన ఎన్‌హెచ్ అధికారులు
- తదుపరి విచారణ ఈ నెల 29కి వాయిదా

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: జాతీయ రహదారి–363పై మందమర్రి శివారు టోల్‌ప్లాజా వద్ద రుసుం వసూళ్లపై శనివారం మరోసారి విచారణ కొనసాగింది. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఉదయ్‌కుమార్ విచారణ జరిపారు. జాతీయ రహదారుల సంస్థ(ఎన్‌హెచ్ఏఐ) తరఫున న్యాయవాది కౌంటర్ దాఖలు చేశారు. బెల్లంపల్లికి చెందిన న్యాయవాది చేను రవికుమార్ టోల్‌ప్లాజా పరిధిలోని 19కిలోమీటర్లలో స్థానిక వాహనదారులకు ఉచిత పాస్‌లు, అంబులెన్స్‌లకు మినహాయింపులు, రోడ్డు నిర్మాణం పూర్తి కాకముందే రుసుం వసూళ్లపై గత మార్చిలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థలో ఫిర్యాదు చేశారు. ఈ కేసుపై పలుమార్లు విచారణలు జరిగాయి. తాజాగా మారోసారి విచారణ జరిగింది. ప్రతివాదులుగా ఉన్న జాతీయ రహదారి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ తరఫు న్యాయవాది కౌంటర్ దాఖలు చేశారు. నిబంధనల ప్రకారమే టోల్ రుసుం వసూలు చేస్తామని, కేంద్ర ప్రభుత్వ గెజిట్ ప్రకారం విలువ ఉంటుందని, ప్రస్తుతం రోడ్డు నిర్మాణం పూర్తయిన మేరకే ఫీజు వసూలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. 20కిలోమీటర్ల పరిధిలోని వారికి నెల వారీగా పాస్ రూ.350 ఇస్తున్నామని, ఇప్పటికే కొందరు తీసుకున్నారని వివరించారు. అంబులెన్సు సేవల వాహనాల కోసం ప్రత్యేక దారి ఉందని తెలిపారు. ప్రజలకు తెలిసేలా నోటిఫికేషన్ ప్రచురించామని కౌంటర్‌లో పేర్కొన్నారు. న్యాయవాది రవికుమార్ జోక్యం చేసుకుంటూ టోల్‌ప్లాజా వద్ద పెద్ద అంబులెన్స్‌లు వెళ్లేందుకు ప్రత్యేక దారి లేదని జడ్జి దృష్టికి తెచ్చారు. మరోవైపు ఈ కేసులో ప్రతివాదులుగా ఉన్న కలెక్టర్‌తోపాటు టోల్ ప్లాజా మేనేజర్ వైపు నుంచి విచారణకు ఎవరూ హాజరు కాలేదు. కలెక్టర్ తరఫున ప్రభుత్వ న్యాయవాది కౌంటర్ దాఖలు చేయాల్సి ఉంది. టోల్‌ప్లాజా మేనేజర్‌కు మరోసారి నోటీసులు ఇవ్వాలని జడ్జి ఆదేశాలు ఇస్తూ విచారణను ఈ నెల 29కి వాయిదా వేశారు.

‘బోదకాలు’పై సర్వే పూర్తి

- జిల్లాలో రక్తనమూనాల సేకరణ
- ఇప్పటికే 852 మంది వ్యాధిగ్రస్తులు


రక్తనమూనాలు సేకరిస్తున్న వైద్య సిబ్బంది

మంచిర్యాలటౌన్: జిల్లాలో బోదకాలు(ఫైలేరియా) వ్యాధిగ్రస్తుల గుర్తింపునకు చేపట్టిన సర్వే పూర్తయింది. గత నెల 27న జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో సర్వే ప్రారంభం కాగా.. ఈ నెల 13న ముగిసింది. జిల్లాలోని జన్నారం, దండేపల్లి, లక్సెట్టిపేట, హాజీపూర్, మంచిర్యాల, మందమర్రి, కాసిపేట, బెల్లంపల్లి, జైపూర్, భీమిని, తాండూర్, వేమనపల్లి మండలాల్లో అనుమానితుల నుంచి రక్త నమూనాలు సేకరించారు. రాత్రి సమయాల్లో మాత్రమే రక్త నమూనాలు సేకరించాల్సి ఉండడంతో సర్వే కాస్త ఆలస్యమైంది. ఆయా మండలాల్లో 3,700 మంది నుంచి రక్త నమూనాలు సేకరించారు. ఇప్పటికే జిల్లాలో బోదకాలు వ్యాధిగ్రస్తులు 852 మంది ఉండగా.. వారికి అవసరమైన కిట్లు, మందులు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ద్వారా అందించి చికిత్స చేస్తున్నారు. ఇందులో తీవ్ర సమస్యతో బాధపడుతున్న 260మందికి ప్రభుత్వం పింఛన్ సైతం అందిస్తోంది. గత ఏడాది బోదకాలు నివారణ కోసం జిల్లా వ్యాప్తంగా రెండేళ్ల వయస్సు దాటిన 7,72,702 మందికి నివారణ మాత్రలు ఇంటింటికీ వెళ్లి అందజేశారు. యేటా వ్యాధిగ్రస్తుల సంఖ్య పెరుగుతుండడంతో ముందస్తుగా ఇచ్చిన మందులతో ఈ ఏడాది వ్యాధిగ్రస్తుల సంఖ్య తగ్గే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు. జిల్లాలోని జన్నారం, దండేపల్లి, హాజీపూర్, భీమిని, కాసిపేట, మందమర్రి, నెన్నెల, నస్పూర్, మంచిర్యాల ప్రాంతాల్లో ఎక్కువగా బోదకాలు నమోదవుతున్నాయి. దీంతో ఎక్కువగా కేసులు నమోదయ్యే ప్రాంతాల్లోని ప్రజలు, అనుమానితుల నుంచి రాత్రి సమయంలో రక్తం నమూనాలను సేకరించి పరీక్షకు పంపించారు. ఫలితాలు వస్తే ఎన్ని కొత్త బోదకాల కేసులు నమోదు అయ్యాయో తేలనుంది.

వ్యాధి నిర్ధారణకే..

జిల్లాలోని బోదకాలు నమోదయ్యే ప్రాంతాల్లో సర్వే చేపట్టాం. అనుమానితుల నుంచి సేకరించిన రక్తనమూనాలను పరీక్షించి, వారికి ఫైలేరియా ఉందో లేదో నిర్ధారిస్తాం. గుర్తించిన వారికి అవసరమైన మందులు, కిట్లు అందించి, వారిని వైద్య సిబ్బంది ఎప్పటికప్పుడు పరిక్ష చేసేలా చర్యలు తీసుకుంటాం. సేకరించిన రక్త నమూనాలకు సంబంధించి మరో రెండు వారాల్లో ఫలితాలు వచ్చే అవకాశం ఉంది.
– డాక్టర్ అనిత, జిల్లా వ్యాధి నిరోధక టీకాల ప్రోగ్రాం ఆఫీసర్

18న సీపీఐ ప్రజాపోరు యాత్ర ప్రారంభం


మాట్లాడుతున్న సీతారామయ్య

బెల్లంపల్లి: కేంద్ర ప్రభుత్వ మతోన్మాద, కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించి చైతన్యపర్చడానికి ఈ నెల 18న బెల్లంపల్లి నియోజకవర్గంలో సీపీఐ ప్రజాపోరు యాత్ర చేపట్టనున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) రాష్ట్ర కార్యదర్శి వాసిరెడ్డి సీతారామయ్య తెలిపారు. శనివారం బెల్లంపల్లి పట్టణ సీపీఐ కార్యాలయంలో ప్రజాపోరు యాత్ర సన్నాహక సమావేశంలో మాట్లాడారు. తాండూర్ ఐబీ చౌరస్తా నుంచి యాత్రను సీపీఐ జాతీయ కార్యదర్శి కే.నారాయణ ప్రారంభిస్తారని తెలిపారు. యాత్రను ప్రజలు, పార్టీ శ్రేణులు విజయవంతం చేయాలని కోరారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేన శంకర్ మాట్లాడుతూ తాండూర్ నుంచి భీమిని, కన్నెపల్లి, బెల్లంపల్లి గ్రామీణ ప్రాంతాల మీదుగా వేమనపల్లి, నెన్నెల మండలాల్లో సాగుతుందని, మే 17న బెల్లంపల్లికి చేరుకుని ముగుస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర సీనియర్ నాయకుడు చిప్ప నర్సయ్య, జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, సీపీఐ బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గ కార్యదర్శి రేగుంట చంద్రశేఖర్, బెల్లంపల్లి పట్టణ కార్యదర్శి డీఆర్ శ్రీధర్, నాయకులు జీసీ మాణిక్యం, ఎం.వెంకటస్వామి, దాగం మల్లేష్, అక్కెపల్లి బాపు, దాసరి తిరుపతిగౌడ్, రత్నం రాజం, బండారి శంకర్ పాల్గొన్నారు.

18, 19న జేబీసీసీఐ సమావేశం
బెల్లంపల్లి: కోల్‌కత్తాలో ఈ నెల 18, 19వ తేదీల్లో జేబీసీసీఐ సమావేశం జరుగుతుందని వేజ్‌బోర్డు కమిటీ సభ్యుడు, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.సీతారామయ్య తెలిపారు. శనివారం బెల్లంపల్లి పట్టణ సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన ఏఐటీయూసీ సమావేశంలో ఆయన మాట్లాడారు. బొగ్గుగని కార్మికుల వేతన సవరణపై చర్చిస్తామని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం అంగీకరించిన 19 శాతం వేతన పెరుగుదలను అమలుపర్చకపోతే దేశవ్యాప్తంగా బొగ్గు గని కార్మికుల సమ్మె చేపడతామని తెలిపారు.

క్లుప్తంగా

కాసిపేట గనిని సందర్శించిన మాన్‌సూన్ ఆడిట్ కమిటీ



కాసిపేటగనిపై కమిటీ సభ్యులు, అధికారులు

కాసిపేట: మందమర్రి ఏరియాలోని కాసిపేట గనిని శనివారం ప్రీ మాన్‌సూన్ (రుతు పవనాల వల్ల సంభవించే అనార్థల నివారణ) ఆడిట్ కమిటీ సభ్యులు సందర్శించారు. కమిటీ కన్వీనర్ ఏరియా రక్షణాధికారి ఆర్‌జీ 3 వెంకటరమణ కమిటీ సభ్యులతో కలిసి కాసిపేట దేవాపూర్ వాగు, కాసిపేట, వరిపేట సాండ్ స్టోయింగ్ బంకర్లు, నార్త్ సైడ్ నాళా, కాసిపేట టన్నల్, చిన్నధర్మారం చెరువులను పరిశీలించారు. అధికారులకు భవిష్యత్ కార్యచరణపై పలు సూచనలు చేశారు. సభ్యులు డీజీఎం సర్వే ఆర్‌జీ 3 జైలావుద్దీన్, గని మేనేజర్ అల్లావుద్దీన్, రక్షణాధికారి సునీల్‌కుమార్, సర్వేయర్ వెంకటేశ్వరరావు ఉన్నారు.

పరీక్ష కేంద్రం @ 400 కిలో మీటర్లు



హాల్‌టికెట్ చూపుతున్న విద్యార్థి రాంచరణ్

వేమనపల్లి: ప్రభుత్వం నిర్వహించే గురుకుల ప్రవేశ పరీక్ష మండల కేంద్రంలోని చిప్ప రాంచరణ్‌కు అందని ద్రాక్షగా మారింది. 7వ తరగతి ప్రవేశ పరీక్ష రాయడానికి 400 కిలోమీటర్ల దూరంలోని మహబూబ్‌నగర్ జిల్లాకు వెళ్లాలని అధికారులు ఆన్‌లైన్‌లో హాల్‌టికెట్‌లో నిక్షిప్తం చేశారు. విద్యార్థి కథనం ప్రకారం .. మండల కేంద్రానికి చెందిన చిప్ప రాంచరణ్ 6వ తరగతి చదువుతున్నాడు. టీఎస్‌ఆర్ గురుకులంలో ఖాళీ ఉన్న మిగులు సీట్ల భర్తీ కోసం నోటిఫికేషన్ జారీ చేసింది. విద్యార్థి ఖాళీలు ఉన్న ఉమ్మడి జిల్లాలోని ఇచ్చోడ, జైపూర్, ఆసిఫాబాద్, టీఎస్‌డబ్ల్యూఆర్‌జేసీ గురుకులాలలో సీట్లు కోసం దరఖాస్తు చేసుకున్నాడు. వీటికి ఉమ్మడి జిల్లా పరిధిలోనే ప్రవేశ పరీక్ష నిర్వహించాల్సింది. 16వ తేదీన మహబూబ్‌నగర్ జిల్లా రాంరెడ్డిగూడంలోని సోషల్ వెల్ఫేర్ పాఠశాలలో పరీక్ష రాయాల్సిందిగా హాల్‌టికెట్‌లో ఆన్‌లైన్ చేశారు. ఒక వైపు ఆరో తరగతి ప్రవేశ పరీక్షతో పాటు మోడల్‌స్కూల్ ప్రవేశ పరీక్ష కూడా అదే రోజు ఉండడంతో విద్యార్థి ఏ పరీక్షకు హాజరు కావాలో అయోమయంలో పడ్డాడు. 400 కిలోమీటర్ల దూరంలోని ప్రవేశ పరీక్షకు హాజరుకాలేక నష్టపోతున్నట్లు వాపోయాడు.

గుండెనొప్పితో మహిళ మృతి



పోసమ్మ(ఫైల్)

జైపూర్: గుండెపోటుతో మహిళ మృతిచెందిన సంఘటన మండలంలోని వెంకట్రావుపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం... చెన్న పోసమ్మ (38) నస్పూర్‌లోని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన సత్యాగ్రహ బహిరంగ సభకు వెళ్లింది. తిరిగి రాత్రి బస్సులో ఇంటికి చేరుకుంది. ఛాతిలో నొప్పి వస్తుందని కుటుంబ సభ్యులకు తెలిపింది. దీంతో మంచిర్యాల ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. మృతురాలికి భర్త రాజయ్య, కొడుకు శేఖర్, కూతురు లక్ష్మి ఉన్నారు.



రెడ్‌వాటిల్డ్ లాపింగ్



బ్లాక్ హెడెడ్ ఐబిస్



గ్రే హెడెడ్ ఫిష్ ఈగల్



క్రస్టెడ్ సర్పెంట్ ఈగల్



ఓరియంటల్ డర్టెల్



పేడ్ కింగ్‌ఫిషర్



చేంజేబుల్ హాక్ ఈగల్



లిటిల్ కార్మోరెంట్

ప్రకృతిలో పక్షుల సోయగం

కవ్వాల్ అడవులు పక్షులకు అవాసాలుగా మారాయి. రకరకాల పక్షులు కవ్వాల్ టైగర్ జోన్‌లోని జన్నారం అడవులలో అవాసాలుగా ఏర్పాటు చేసుకుంటున్నాయి. ఇటీవల బర్డ్ వాక్ లో పలు రకాల పక్షులు కనిపించాయి. శనివారం అటవి అధికారులు తీసిన ఫొటోలలో స్థానికంగా కనిపించే పక్షులతో పాటు, వలస పక్షులు కూడా తమ సోయగాలను చూపించాయి. వలస పక్షులైనా గ్రే హీడేడ్ ఫిష్ ఈగల్, బ్లాక్ హీడెడ్ ఈగల్, లిటిల్ కార్మోరెంట్, ఓరియంటల్ డర్టెల్, రెడ్ వాటిల్డ్ లాపింగ్ పక్షులు కెమెరాలో చిక్కాయి. ప్రతి సంవత్సరం శీతాకాలం వరకు ఉండే ఈ పక్షులు ఈ సంవత్సరం వేసవిలో కూడా ఇక్కడే అవాసాలు ఏర్పాటు చేసుకుని ఉండటం మంచి పరిణామమని డిప్యూటీ కన్జర్వేటర్ సిరిపురం మాధవరావు తెలిపారు. - జన్నారం

వామ్మో.. వానరాలు





- నేరుగా ఇళ్లలోకి వచ్చి చేరుతున్న వైనం
- రామకృష్ణాపూర్, సీసీసీ, చెన్నూర్‌లలో ఇదే వరుస
- వన్యప్రాణి చట్టం సాకుగా చూపుతున్న అధికారులు
- ప్రత్యామ్నాయ మార్గాలు చూపాలని ప్రజల వేడుకోలు

పట్టణంలోని బీజోన్ ఏరియాకు చెందిన కంకులు అమ్ముకునే భూమక్క ఇటీవల కోతుల దాడిలో గాయపడింది. ప్రతీ రోజు కంకులను ఎత్తుకెళ్తుండడంతో ఆర్థికంగా నష్టపోవటమే కాకుండా అడ్డుకునే ప్రయత్నంలో వాటి దాడిలో గాయపడింది. ఏ వైపు నుంచి కోతులు దాడిచేస్తాయోనని భయంతో చిరు వ్యాపారం చేసుకుంటుంది భూమక్క. ఇలా జిల్లాలో పలువురు చిరువ్యాపారులే కాదు సామాన్య ప్రజలు సైతం తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. కోతులను అరికట్టాలని కోరుతున్నారు.

రామకృష్ణాపూర్: ×అసలే కోతి..పైగా కల్లు తాగితే≅ అన్నట్లుంది పరిస్థితి. వానరాల బెడదతో కొన్ని కోల్‌బెల్ట్ ప్రాంతాలు బిక్కుబిక్కుమంటున్నాయి. ప్రశాంతంగా రోడ్డునపోయే ఆస్కారం లేకుండా పోయింది. ఏ వైపు నుంచి వస్తాయో చేతులోని కవర్లను ఎలా గిరాటేస్తాయో తెలియని అయోమయస్థితి. జిల్లాలోని చెన్నూర్, రామకృష్ణాపూర్, సీసీసీ, శ్రీరాంపూర్ ప్రాంతాల్లో ఇదే తరహా వాతావరణం నెలకొంది. ఒక్కోసారి నేరుగా ఇళ్లల్లోకి చొరబడుతున్నాయి. ఈ బాధ నుంచి విముక్తి కల్పించాల్సిన అధికారులు వన్యప్రాణి చట్టాన్ని సాకుగా చూపి చర్యలకు వెనుకంజ వేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

అధికారులు స్పందించాలి...

కోతుల సంచారంతో నెలకొన్న ఆందోళనకర పరిస్థితులకు సంబంధిత అధికారులు అడ్డుకట్ట వేయాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కాగా వన్యప్రా ణి చట్టాన్ని బూచీగా చూపిస్తు అధికారులు కనీస స్పందన లేకుండా ఉంటున్నారని పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇళ్లల్లోకి చొరబడుతూ చిన్నపిల్లలు, పెద్దలపై దాడులు చేస్తున్నప్పటికీ అధికారులు కిమ్మనక పోవడంపై ప్రజలు బాహాటంగానే మండిపడుతున్నారు. ఒకవేళ కోతులు కరిచిన పక్షంలో వైద్యచికిత్సలు కూడా చాలా ఖర్చుతో కూడుకుంటున్నాయ ని కలవరపడు తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శా ఖల అధికారులు అప్రమత్తమై వీటిని పట్టుకునేందుకు బోనులు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

బయటకు వెళ్లేందుకు ఆందోళన..



రోజురోజుకూ అధికమవుతున్న కోతులబెడదతో తట్టుకోలేక పోతున్నామని పట్టణ ప్రజలు వాపోతున్నారు. చెన్నూర్, సీసీసీ, శ్రీరాంపూర్ తదితర ప్రాంతాల్లో కోతులు ఇళ్లల్లోకి వచ్చి పప్పుడబ్బాలు లాక్కునిపోతుండటం గమనార్హం. చిన్న పిల్లలను బయటకు పంపేందుకు తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఒక్కోసారి వారిపై ఎగబడి గాయాలు చేస్తున్నాయి. స్థానిక ఠాగూర్‌స్టేడియం సమీపంలోని పార్కుకు ఆహ్లాదం కోసం వెళ్తే అక్కడ కూడా కోతుల సంచారం ఉండడంతో స్థానికులు వెళ్లేందుకు జంక్కుతున్నారు.

కోతులను తరలించేందుకు గైడ్‌లైన్స్ రావాలి



కుక్కలను నిర్మూలించటానికి ఏబీసీ (యానిమల్ బర్త్ కంట్రోల్) విధానాన్ని తీసుకువచ్చి మున్సిపాలిటీలకు గైడ్స్‌లైన్స్‌ను ఇచ్చారు. అయితే కోతులను పట్టుకుని తరలించేందుకు ఎలాంటి గైడ్‌లైన్స్ ఉన్నతాధికారుల నుండి రాలేదు. వస్తే కోతులను సురక్షితంగా అడవుల్లోకి తరలించేందుకు వెంటనే చర్యలు తీసుకుంటాం. - వెంకటనారాయణ, క్యాతనపల్లి మున్సిపల్ కమిషనర్

25న జీఎం కార్యాలయం ఎదుట ధర్నా



మాట్లాడుతున్న ఎస్కే బాజీసైదా

శ్రీరాంపూర్: సింగరేణిలో కాంట్రాక్ట్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఈ నెల 25న శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు ఏఐటీయూసీ డెప్యూటీ ప్రధాన కార్యదర్శి ఎస్కే బాజీసైదా, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ముస్కె సమ్మయ్యలు తెలిపారు. శనివారం శ్రీరాంపూర్ ఓసీపీలో జరిగిన సమావేశంలో వారు కాంట్రాక్ట్ కార్మికులనుద్దేశించి మాట్లాడారు. కాంట్రాక్ట్ కార్మికులకు 2020 నుంచి సీఎంపీఎఫ్ చీటీలు ఇవ్వాల్సి ఉండగా ఇప్పటికి ఇవ్వలేదన్నారు. దీంతో వారి అకౌంట్లలో ఎన్ని డబ్బులు జమ అయ్యాయో తెలియక సతమతం అవుతున్నారన్నారు. గతంలో సమ్మె సందర్భంగా ఆర్‌ఎల్సీ సమక్షంలో జరిగిన ఒప్పందాలను వెంటనే అమలు చేస్తూ ఉత్తర్వులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ కార్మికులందరికి కోలిండియాలో ఇస్తున్నట్లుగా హైపవర్ కమిటీ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కంపెనీలో ఖాళీగా ఉన్న క్వార్టర్లను కాంట్రాక్ట్ కార్మికులకు ఇవ్వాలని, కంపెనీ ఆసుపత్రుల్లో పర్మినెంట్ ఉద్యోగులకు అందిస్తున్నట్లు కాంట్రాక్ట్ కార్మికులకు కూడా వైద్య సేవలు అందించాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ల సాధనలో భాగంగా జీఎం కార్యాలయం ఎదుట నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాల్సిందిగా కాంట్రాక్ట్ కార్మికులను కోరారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్‌ఖాన్, మండల కార్యదర్శి దొడ్డిపట్ల రవీందర్, నాయకులు చంద్రమోహన్ ఉన్నారు.

అభివృద్ధి పనులు పరిశీలన



వివరాలు తెలుసుకుంటున్న ఎఫ్‌డీపీటీ

జన్నారం: కవ్వాల్ టైగర్‌జోన్‌లోని జన్నారం అటవి డివిజన్‌లో శనివారం టైగర్ ప్రాజెక్ట్ ఫీల్డ్ డైరెక్టర్ వినోద్‌కుమార్ అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ క్రమంలోని డివిజన్‌లోని చింతగూడ గ్రాస్ ప్లాంటేషన్, మల్యాలలోని జింకల పునరుత్పత్తి కేంద్రం, నూతనంగా నిర్మించ తలపెట్టిన రిసర్టుల పనులను పరిశీలించారు. అదే విధంగా నీటి సౌకర్యాలు, గడ్డి క్షేత్రాలపై తీశారు. అడవుల రక్షణ, వన్యప్రాణుల సంరక్షణపై ఎఫ్‌డీవో మాధవరావు ను అడిగి తెలుసుకున్నారు. వారి వెంట రేంజ్ అధికారులు హఫీజోద్దీన్, రత్నాకర్‌రావు ఉన్నారు.

నిందితుడిని అరెస్టు చేసిన రాజస్థాన్ పోలీసులు

రెబ్బెన(ఆసిఫాబాద్): డ్రగ్స్ స్మగ్లింగ్ కేసులో పరారీలో ఉన్న నిందితుడిని రెండ్రోజుల క్రితం రాజస్థాన్ పోలీసులు రెబ్బెన మండల కేంద్రంలో అరెస్టు చేశారు. వివరాలిలా ఉన్నాయి. రాజస్థాన్ రాష్ట్రంలోని పాలి జిల్లా హా అంజావా గ్రామానికి చెందిన రతన్‌సింగ్‌పై 2016లో డ్రగ్స్ స్మగ్లింగ్ కేసు నమోదైంది. రాజస్థాన్ రాష్ట్రం నుంచి పరారై వచ్చి రెబ్బెన మండలంలోని ఓ స్వీట్ షాపులో పని చేస్తున్నాడు. రాజస్థాన్ పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపులు చర్యలు చేపట్టారు. పక్కా సమాచారం మేరకు మండలానికి వచ్చి నిందితుడిని పట్టుకుని రాజస్థాన్‌కు తరలించారు. ఈ విషయమై రెబ్బెన ఎస్సై భూమేష్‌ను సంప్రదించగా రతన్‌సింగ్‌పై డ్రగ్స్ స్మగ్లింగ్ కేసు నమోదైందని, అక్కడి పోలీసులు రాజస్థాన్‌కు తరలించారని పేర్కొన్నారు.

అక్రమ వెంచర్లలో హెచ్చరిక బోర్డులు



సీతారాంపల్లిలోని అక్రమ వెంచర్‌లో హెచ్చరిక బోర్డు ఏర్పాటు

సాక్షి ఎఫెక్ట్..

నస్పూర్: పట్టణ పరిధిలోని ఎలాంటి అనుమతులు లేని అక్రమ వెంచర్లలో హెచ్చరిక బోర్డులను మున్సిపల్ సిబ్బంది ఏర్పాటు శనివారం చేశారు. ఈ నెల 11న సాక్షిలో ప్రచురితమైన 'అనుమతి లేని వెంచర్... నిర్మాణానికి ఇక్కట్లు'శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మున్సి పాలిటీ నుంచి అనుమతులు లేకుండా వెలసిన అక్రమ వెంచర్లలో హెచ్చరిక బోర్డులను మున్సిపల్ సిబ్బంది శనివారం ఏర్పాటు చేశారు. అక్రమ లే అవుట్లలో లేదా అనుమతి లేని లే అవుట్లలో ప్లాట్లు కొనవద్దని, ఇలాంటి వాటికి ఎప్పటికి అనుమతులు ఇవ్వలేమని కమిషనర్ రమేశ్ తెలిపారు. పట్టణ పరిధిలోని సీతారాంపల్లిలోని నాలుగు, తీగల్‌పహడ్‌లోని ఒకటి, సంఘం మల్లయ్యపల్లిలో రెండు, సింగాపూర్ ఆర్ అండ్ ఆర్ సైట్ పక్కన గల ఒక వెంచర్లతో కలిపి మొత్తం ఎనిమిది అక్రమ వెంచర్లలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

ఆగని ఇళ్ల నిర్మాణాలు



ఇళ్ల చుట్టూ ప్రహరీ నిర్మాణం

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీ కన్నాల శివారు ప్రాంతంలో ప్రభుత్వ భూమిని అక్రమించి శాశ్వ త కట్టడాలను కడుతున్నారు. రోజువారీగా ఇళ్ల నిర్మాణ పనులు జరుగుతున్నా రెవెన్యూ అధికారులు కన్నెత్తి చూడడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. కన్నాల శివారులోని సర్వే నంబర్ 112 లోని ప్రభుత్వ భూమిని కబ్జా చేసి దర్జాగా పక్కా గృహాల నిర్మాణం చేస్తున్నారని వార్తా కథనాలు వచ్చిన అధికారుల్లో చలనం లేదు. ఇప్పటికే ఇంటి నిర్మాణాను పూర్తి చేసిన అక్రమార్కులు తాజాగా కట్టుకున్న ఇళ్ల చుట్టు సిమెంట్ పలకలతో ఏకంగా ప్రహారీ నిర్మిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వెంటనే అక్రమకట్టడాల నిర్మాణాలను నిలుపాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

రాలిన రైతుల ఆశలు



జంగాల్‌పేటలో కాయలు ఏరుతున్న రైతులు

నెన్నెల: చేతికి అందివచ్చిన మామిడి సాగు శుక్రవారం రాత్రి కురిసిన అకాల వర్షంతో నేలరాలింది. దీంతో రైతుల ఆశలు ఆవిరయ్యాయి. గత నెలలో వీచిన గాలివానకు 25శాతం, ఈసారి అకాల వర్షానికి 20శాతం కాయలు నేలరాలాయి. మండలంలోని నెన్నెల, లంబాడీతండా, కోణంపేట, మన్నెగూడం, జంగాల్‌పేట, నందులపల్లి, గన్‌పూర్ గ్రామాల్లోని మామిడి రైతులు తీవ్రంగా నష్టపోయారు. ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

రేషన్ దుకాణం సీజ్



రేషన్ షాపు సీజ్ చేస్తున్న తహసీల్దార్

మందమర్రిరూరల్: పట్టణంలోని అంగడీబజార్ ఏరియాలోని 64వ నంబర్ గల రేషన్ దుకాణాన్ని శనివారం తహసీల్దార్ సంపతి శ్రీనివాస్ సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్ని రోజులుగా లబ్దిదారులకు రేషన్ బియ్యం పంపిణీ చేయడం లేదని, షాపును ఓపెన్ చేయడం తో పాటు ఫోన్‌లో సైతం స్పందించకపోవడంతో రేషన్ బియ్యం కోసం పలువురు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో లబ్దిదారుల ఫిర్యాదు మేరకు షాపును సీజ్‌చేసినట్లు తెలిపారు.

గుండెపోటుతో విద్యార్థి మృతి



వికాస్‌రాజ్ మృతదేహం

మందమర్రిరూరల్: గుండెపోటుతో ఇంటర్ విద్యార్థి మృతిచెందిన సంఘటన శనివారం పట్టణంలో వెలుగు చూసింది. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం... పట్టణంలోని మొదటి జోన్‌కు చెందిన పెంటపర్తి వికాస్‌రాజ్ (17) కరీంనగర్ జిల్లా వేములవాడలోని సాంఘిక సంక్షేమ శాఖ కళాశాలలో ఇంటర్ రెండో సంవత్సరం పరీక్షలు ఇటీవల పూర్తి చేసుకుని ఇంటికి వచ్చాడు. శనివారం ఉదయం ఎడమ చేతితో పాటు ఎడమ వైపు శరీర భాగం లాగుతుందని చెప్పడంతో కుటుంబీకులు సమీపంలోని ప్రైవేట్ వైద్యుడి వద్దకు తీసుకున్నారు. పరిస్థితి విషమంగా ఉందని వైద్యుడు తెలుపడంతో 108లో సింగరేణి ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు అక్కడి వైద్యులు తెలిపారు. తండ్రి సురేశ్ బ్యాంకు ఉద్యోగి కాగా ఒక్కగానొక కుమారుడు మృతిచెందడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.

బావిలో దూకి ఒకరి ఆత్మహత్య

లక్సెట్టిపేట: బావిలో దూకి ఒకరు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన పట్టణంలోని గాంధీనగర్‌లో శనివారం చోటుచేసుకుంది. ఎస్సై లక్ష్మణ్ తెలిపిన వివరాల ప్రకారం... రాచర్ల అజయ్ (40) వయస్సు దాటిపోయినా ఇంకా పెళ్లి కాకపోవడంతో మనస్తాపానికి గురయ్యాడు. దీంతో కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. రెండు రోజులుగా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు తెలిసినా వారి వద్ద ఆరా తీసిన ఫలితం కానరాలేదు. శనివారం అంకతివాడ సమీపంలోని ఓ వ్యవసాయ బావిలో అజయ్ మృతదేహం కనిపించింది. తండ్రి చిలుకయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రాజెక్ట్‌లో దూకి వృద్ధుడు..

పెంచికల్‌పేట్: అనారోగ్యంతో బాధపడుతున్న వృద్ధుడు ప్రాజెక్టులో దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని ఎల్లూర్ గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. ఇన్‌చార్జి ఎస్సై ప్రభాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన దుర్గం నానయ్య (80) రెండు సంవత్సరాలుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఆస్పత్రులకు వెళ్లినా ఆరోగ్యం కుదుటపడకపోవడంతో మానసికంగా తీవ్రంగా కుంగిపోయి గ్రామ సమీపంలోని బొక్కివాగు ప్రాజెక్టులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుమారుడు పోశన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చేపల వలలో మొసలి..



చేపల వలకు చిక్కిన మొసలిని చూపిస్తున్న జాలర్లు...

దండేపల్లి: మండలంలోని పెద్దపేట చెరువులో శనివారం జాలర్లు చేపల వేటకు వెళ్లారు. వలతో చేపలు పడుతుండా అందులో మొసలి చిక్కింది. గమనించిన జాలర్లు మొసలిని ఒడ్డుకు తెచ్చి తాళ్లపేట అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. దీంతో వారు అక్కడికి చేరుకుని మొసలిని గూడెం గోదావరి నదిలో వదిలిపెట్టారు. ఈ చెరువులో చేపల వలకు మొసలి చిక్కడం ఇది రెండోసారి. ఈ నెల 7న కూడా చేపలు పడుతుండా వలలో మొసలి పిల్లచిక్కిన విషయం తెలిసిందే.